క్లుప్తంగా

రేపు మండల సమావేశం

రాయవరం: స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ కె.నరేంద్రరెడ్డి గురువారం విలేకరులకు తెలిపారు. శనివారం ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ నౌడు వెంకటరమణ అధ్యక్షతన సమావేశం నిర్వహించనున్నామన్నారు. మండల పరిషత్ సర్వ సభ్య సమావేశపు హాలులో నిర్వహించే సమావేశానికి ప్రజాప్రతినిధులు హాజరవుతారన్నారు. అన్ని శాఖల అధికారులు తమ పరిధిలో అభివృద్ధిపై పూర్తి సమాచారంతో హాజరు కావాలన్నారు.

24న కొబ్బరి చెట్ల ఫలసాయానికి బహిరంగ వేలం

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం ఆర్టీసీ డిపో పరిధిలోని కొబ్బరి చెట్ల ఫలసాయానికి ఈ నెల 24న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ కొడమంచిలి వెంకటేశ్వర్లు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. రామచంద్రపురం డిపో గ్యారేజీ ఆవరణలోని 42 చెట్లకు, ద్రాక్షారామ బస్‌స్టేషన్ ఆవరణలోని 5 కొబ్బరి చెట్ల ఫల సాయానికి రెండు సంవత్సరాల కాల పరిమితితో వేలం నిర్వహిస్తామన్నారు. శనివారం మధ్యాహ్నం 3 గంటలకు డిపోలోని సెక్యూరిటీ కార్యాలయం వద్ద నిర్వహించే వేలం పాటలో ఆసక్తి కలిగిన వారు పాల్గొనాలని కోరారు. మరింత సమాచారం కోసం తమ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

రేపు డయల్ యువర్ డీఎం


వెంకటేశ్వర్లు ఆర్టీసీ డిపో మేనేజర్

రామచంద్రపురం రూరల్: ప్రయాణికుల సమస్యల పరిష్కారం కోసం శనివారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డిపో మేనేజర్ (డయల్ యువర్ డీఎం) కార్యక్రమం నిర్వహించన్నారు. ఈ విషయాన్ని రామచంద్రపురం ఆర్టీసీ డిపో మేనేజర్ కొడమంచిలి వెంకటేశ్వర్లు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ ప్రయాణికులు, ప్రజలు 99592 25536 నంబర్‌కు ఫోన్ చేసి తమ సలహాలు, సూచనలు తెలియజేయాలని కోరారు. ప్రజల సలహాలు, సూచనల మేరకు మరింత మెరుగైన సేవలు అందించడానికి కృషి చేస్తామని చెప్పారు.

అంతరిక్ష దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

రామచంద్రపురం రూరల్: అమలాపురం మండలంలోని వన్నె చింతలపూడి గ్రామంలో శుక్రవారం జాతీయ అంతరిక్ష దినోత్సవం నిర్వహించనున్నట్లు జిల్లా సైన్స్ అధికారి గిరజాల వెంకటసత్య సుబ్రహ్మణ్యం గురువారం తెలిపారు. ఈ మేరకు కార్యక్రమ ప్రచార పోస్టర్‌ను ద్రాక్షారామలో యంగ్ మైండ్స్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు వాకాడ చిన్నతో కలసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల్లో అంతరిక్ష దినోత్సవం ఆవశ్యకతపై ప్రజల్లో విస్తృతంగా ప్రచారం కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యంగ్ మైండ్స్ సభ్యులు ప్రదీప్‌కుమార్, బండి నూకరాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

రామచంద్రపురం: స్థానిక కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గెస్ట్ ఫ్యాకల్టీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వి.సోమశేఖరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కళాశాలలో మ్యాథ్‌మెటిక్స్, జువాలజీ సబ్జెక్టులకు అధ్యాపకులు లేని కారణంగా గెస్ట్ ఫ్యాకల్టీల నుంచి దరఖాస్తులను కోరుతున్నట్లు చెప్పారు. అభ్యర్థులకు పోస్టు గ్రాడ్యుయేషన్‌లో 50 శాతం మార్కులు ఉండాలన్నారు. బోధన చేసిన గంటకు రూ.150 చొప్పున నెలకు మొత్తం రూ.10 వేలు మించకుండా గౌరవ భృతి ఇస్తారని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 24వ తేదీ లోపు దరఖాస్తులను కళాశాలలో సమర్పించాలని తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


లెప్రసీ కాలనీలో కిట్లను పంపిణీ చేస్తున్న జిల్లా అడిషనల్ వైద్యాధికారి భరతలక్ష్మి తదితరులు

రామచంద్రపురం: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వ్యాధులు సోకకుండా ముందు జాగ్రత్త చర్యలు పాటించాలని జిల్లా అడిషనల్ వైద్యాధికారి సీహెచ్ వి.భరతలక్ష్మి సూచించారు. పట్టణంలోని వైఎస్ఆర్ నగర్‌లో ఏర్పాటు చేసిన హెల్త్ క్లినిక్‌ను గురువారం ఆమె సందర్శించారు. వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. అనంతరం లెప్రసీ కాలనీలో 30 మంది వ్యాధిగ్రస్తులకు అవసరమైన కిట్లను పంపిణీ చేశారు. అనంతరం స్థానిక ఏరియా ఆసుపత్రిలో హెచ్ఐవీ, ఎయిడ్స్ టీబీ కేంద్రాలను సందర్శించి తగు సూచనలు చేశారు. యూపీహెచ్‌సీ డాక్టర్ సుధీర్, జిల్లా డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ మాధవరపు వెంకటేశ్వర్లు, జిల్లా సూపర్ వైజర్ రాఘవేంద్రరావు, భగవాన్, దుర్గాప్రసాద్, లీలా, హెచ్‌వీ రాణి తదితర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రచారమా.. ప్రగతి కార్యాచరణా..!

- నేడు గ్రామాల్లో ఉపాధి గ్రామ సభలు
- జన సమీకరణకే ప్రాధాన్యం
- ఒకే రోజు అన్ని గ్రామాల్లో కార్యక్రమాలు
- అన్నిచోట్లకు అధికారులు వెళ్లలేని పరిస్థితి


వెదురుమూడిలో రైతు కోరిన చోటకు ధాన్యాన్ని తరలిస్తున్న ఉపాధి కూలీలు (ఫైల్)

కపిలేశ్వరపురం: లక్ష్యం మంచిదైనప్పుడు ప్రచార ఆర్భాటాలు అవసరం ఉండదు. ప్రజాస్వామ్య దేశంలో ప్రజల భాగస్వామ్యం అత్యంత ప్రాధాన్యతగలది. వారిని ముందుకు నడిపించడంలో ప్రభుత్వ అధికార యంత్రాంగం మార్గదర్శకంగా ఉంటుంది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం లక్ష్యాన్ని ప్రజలకు వివరించడమూ, పనులను గుర్తించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం నేడు అన్ని గ్రామాల్లో ఒకేసారి గ్రామ సభలను నిర్వహిస్తోంది. సీఎం చంద్రబాబు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వానపల్లి గ్రామ సభలో పాల్గొంటున్నారు. ఉపాధి గ్రామ సభల ద్వారా పనులను గుర్తించడం ప్రణాళికాబద్ధంగా మండలంలో కనీసం ఐదు రోజుల పాటు నిర్వహించాల్సి ఉంటుంది. ఒకే రోజులో అన్ని గ్రామాల్లో సభలు నిర్వహించడం వల్ల నాణ్యత కొరవడే అవకాశం ఉంటుంది. అంతేకాకుండా అధికారులు అన్ని చోట్ల అందుబాటులో ఉండడం కష్టమవుతుంది.

ఉపాధి గ్రామ సభల లక్ష్యమిదీ

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులపై ప్రజలకు అవగాహన కల్పించడమే గ్రామసభల ప్రధాన లక్ష్యం. ఉపాధి పనులను గుర్తించేందుకు సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులు, ఎన్ఆర్ఈజీఎస్ అధికారులు, సిబ్బంది, ఉపాధి కూలీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ప్రజాప్రతినిధులు సమక్షంలో గ్రామ సభలను నిర్వహించాల్సి ఉంది.

అన్ని చోట్ల అధికారులు ఉండలేక..

ఎన్ఆర్ఈజీఎస్‌లో చేపట్టాల్సిన పనుల గుర్తింపు కోసం ప్రత్యేక గ్రామ సభలను నిర్వహించడం మంచిదే. కానీ ఒక్కరోజులు అన్ని పనుల గురించి నిర్ణయం తీసుకోవడం సాధ్యం కాదు. గత ప్రభుత్వాలు నిర్వహించిన తీరుగా షెడ్యూలు ప్రకారం కనీసం ఐదు రోజులు పాటు నిర్వహిస్తే ప్రయోజనం ఉంటుంది. రామచంద్రపురంలో 25, కె.గంగవరం మండలంలో 26 కాజులూరులో 26, రామచంద్రపురం నియోజకవర్గం మొత్తం 77 గ్రామాలున్నాయి. మండపేట, రాయవరం మండలాలలో 12 గ్రామాలు చొప్పున, కపిలేశ్వరపురంలో 19 గ్రామాలు మొత్తం 43 గ్రామాలున్నాయి. సుమారు మండలానికి 12 నుంచి 26 గ్రామాలున్నాయి. ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ శాఖల అధికారులు, ఎన్ఆర్ఈజీఎస్ అధికారులు, సిబ్బంది అన్ని గ్రామ సభలకు హాజరుకాలేని పరిస్థితి నెలకొంది. వేర్వేరు శాఖల అధికారులు హాజరైనప్పటికీ ఉపాధి పనుల తీరును ఆ విభాగం అధికారులే ప్రజలకు స్పష్టంగా వివరించాలి. కానీ పనులపై అవగాహన లేకుంటే ప్రజలకు వివరించలేరు.

ప్రతిపాదించే పనులివీ

జిల్లాలోని కూలీలకు 57 లక్షల ఉపాధి పని దినాలను కల్పించాలన్నది లక్ష్యం. మెటీరియల్, లేబర్ కాంపోనెంట్‌లతో 266 రకాల పనులను గుర్తించాల్సి ఉంది. మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా ప్రభుత్వ భవనాల నిర్మాణాలు, సిమెంట్, బీటీ, డబ్ల్యూబీఎం, గ్రావెల్ రహదారులు, డ్రెయిన్ల నిర్మాణాలను గ్రామసభలో ప్రతిపాదించొచ్చు. ఊట చెరువులు, పశువుల చెరువులు, చెక్ డ్యాం, బోర్‌వెల్ రీఛార్జి గుంతల నిర్మాణాలను అడగొచ్చు. పొలం గట్లపై మొక్కల పెంపకం, వ్యక్తిగత భూముల్లో సేద్యపు నీటి కుంటల నిర్మాణం, వ్యవసాయ బావుల నిర్మాణాలను, పశువుల షెడ్లు, కోళ్లఫారాల నిర్మాణాలను ప్రతిపాదించొచ్చు.

వేతన బకాయిలు ఇంత వరకూ చెల్లించక..

కూటమి ప్రభుత్వం అధికారాన్ని చేపట్టిన తర్వాత సుమారు రెండు నెలలు పాటు ఉపాధి కూలీలకు వేతనాలను చెల్లించలేదు. వేతన బకాయిలు అందక కూలీలు యాతనపడుతున్నారు. కపిలేశ్వరపురం మండలంలో 12,120 జాబ్ కార్డులుండగా లక్షా రెండు వేల పనిదినాల్లో శ్రమించారు. వారికి రూ.3.24 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉంది. మండపేటలో 12,160 జాబ్ కార్డులుండగా 95 వేల పనిదినాలు చేశారు. కూలీలకు రూ.2.47 కోట్ల వేతనాలను బకాయిలున్నాయి. రాయవరం మండలంలో 9,780 జాబ్ కార్డులుండగా లక్షా ఒక వెయ్యి పనిదినాలు చేశారు. వారికి రూ. 2.80కోట్ల చెల్లించాల్సి ఉంది.

మండపేట నియోజకవర్గంలో మొత్తం రూ.34,060 జాబ్ కార్డులుండగా 2,98,000 పని దినాలు పని చేశారు. వారికి రూ.8,51,00,000 చెల్లించాల్సి ఉంది. రామచంద్రపురం మండలంలో 13,210 జాబ్ కార్డులుండగా 1.58 లక్షల పనిదినాలు పనిచేశారు. వారికి రూ.4.83 కోట్ల వేతనాలను చెల్లించాల్సి ఉంది. కె.గంగవరం మండలంలో 13,726 జాబ్‌కార్డులు ఉండగా 1.52లక్షల దినాలు పని చేశారు. వారికి రూ.4.71కోట్ల వేతనాలు చెల్లించాలి. రామచంద్రపురం నియోజకవర్గంలో 26,936 జాబ్ కార్డులుండగా 3,10,000 పనిదినాలు పని చేశారు. వారికి రూ.9.54 కోట్ల చెల్లించాల్సి ఉంది. బకాయిలపై కూలీల నుంచి ఒత్తిడి పెరగడంతో ప్రభుత్వం ఈ వారం నుంచి చెల్లింపులు ప్రారంభించింది.

గత ప్రభుత్వంలో లక్ష్యానికి మించి పనులు

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను జిల్లాకు 30 లక్షల పనిదినాల లక్ష్యాన్ని నిర్దేశించారు. కాగా 43 లక్షల పనిదినాలను కల్పించి లక్ష్యాన్ని మించి కృషి చేసింది. అందుకోసం రూ.185 వెచ్చించగా అందులో రూ.112ను వేతనాలుగా కేటాయించింది.

కిల్కారీ మొబైల్ సర్వీసెస్ అకాడమీ ట్రైనింగ్


ఆశ కార్యకర్తలకు సూచనలు చేస్తున్న మోహనరావు

కపిలేశ్వరపురం: ప్రతి తల్లి స్వీయ ఆరోగ్య సేవే లక్ష్యంగా రూపొందించిన కిల్కారీ కార్యక్రమాన్ని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ఆశ కార్యకర్తలు చిత్తశుద్ధితో అమలు చేయాలని ఆ శాఖ రీజనల్ అధికారి ఆర్.మోహనరావు ఆదేశించారు. మండలంలోని అంగర, వాకతిప్ప, అచ్యుతాపురం పీహెచ్‌సీల పరిధిలోని వైద్య ఆరోగ్య, ఆశ కార్యకర్తలకు స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం ఒక రోజు శిక్షణ తరగతిని నిర్వహించారు. రీజనల్ అధికారి మోహనరావు మాట్లాడుతూ గర్భిణులకు కిల్కరి కార్యక్రమం పేరుతో ఫోన్ కాల్స్ చేయడం ద్వారా తల్లీ బిడ్డల ఆరోగ్య సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. సకాలంలో శాస్త్రీయమైన వైద్య సలహాలు అందించవచ్చన్నారు. దీని ద్వారా మాతృ, శిశు మరణాలను అరికట్టవచ్చన్నారు. జిల్లా ప్రోగ్రాం అధికారి రవికుమార్ మాట్లాడుతూ శిక్షణ తరగతిలో పొందిన సమాచారాన్ని క్షేత్ర స్థాయిలో అమలు చేయడం ద్వారా ఆశ, వైద్య ఆరోగ్య కార్యకర్తలు చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. కార్యక్రమ లక్ష్యాన్ని వివరిస్తూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపీహెచ్ఈఓ బిషప్, హెచ్ఇ బి.రామారావు, ఎంపీహెచ్ఎస్ కామేశ్వరరావు, హెల్త్ విజిటర్స్ పాల్గొన్నారు.

చవితి ఉత్సవాలకు రాట ముహూర్తం


గణపతి నవరాత్ర ఉత్సవాలకు పందిరిరాట ముహూర్తం చేసిన ఉత్సవ కమిటీ సభ్యులు

మండపేట: పట్టణంలోని బస్టాండు వద్ద గణపతి నవరాత్ర ఉత్సవాలకు శ్రీలక్ష్మీగణపతి ఉత్సవ కమిటీ గురువారం రాట ముహూర్తం చేసింది. స్థానిక 4వ వార్డుకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు అయినవిల్లి రాజేష్, నరేష్ (చిన్నారి) బస్టాండు వద్ద ఉత్సవాలు నిర్వహించేందుకు అంకురార్పణ చేశారు. తొమ్మిది రోజుల పాటు చవితి వేడుకలు జరగనున్నాయి. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పిల్లా వీరబాబు, ఉత్సవ కమిటీ సభ్యులు సాధనాల శివభగవాన్, అయినవిల్లి ఆదినారాయణ, కోయల సాయిబాబా, కాయల రాము, కాయల చంద్రశేఖర్, జీఆర్సీ మోహన్, కాయల రమేష్, కోయల సతీష్, రావూరి దుర్గాప్రసాద్, పిల్లా విజయ్, అంజి తదితరులు పాల్గొన్నారు.

గోదావరి యాస, సంఘటనలతో సందేశాత్మక చిత్రం


సభలో మాట్లాడుతున్న నిహారిక

మండపేట: గోదావరి జిల్లాల్లో నిత్యం కనిపించే ఘటనలతో సందేశాత్మక చిత్రం కమిటీ కుర్రోళ్ళు నిర్మించినట్టు నిర్మాత, నటుడు కొణిదెల నాగబాబు కుమార్తె నిహారిక పేర్కొన్నారు. ఇటీవల విడుదలైన చిత్రాల్లో బ్లాక్ బస్టర్ హిట్‌గా నిలిచిన కమిటీ కుర్రోళ్ళు చిత్రం యూనిట్ మండపేటలో సందడి చేసింది. విజయోత్సవ యాత్రలో భాగంగా చిత్ర దర్శకుడు యదు వంశీ, నిర్మాత నిహారికతో పాటు చిత్రంలో హీరోలుగా నటించిన 11 మంది కొత్త కుర్రోళ్లు సప్తగిరి థియేటర్‌కు గురువారం విచ్చేసి మాట్లాడారు. నిహారిక మాట్లాడుతూ చిత్రాన్ని ఇంతగా విజయవంతం చేసిన ప్రేక్షకుల ఆదరాభిమానాలు మరువలేనివన్నారు. యూనిట్ సభ్యులను సప్తగిరి థియేటర్ యాజమాన్యం మల్లిపూడి గణేష్, ముత్యాల రామకృష్ణ దుశ్శాలువలతో సత్కరించారు.

ఆధునిక పరిజ్ఞానం అవసరం

డిగ్రీ కాలేజీలో అంతర్జాతీయ సదస్సు


సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగేశ్వరరావు

మండపేట: ప్రస్తుతం విద్యార్థులు ఆధునిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని అనుకున్న లక్ష్యాలకు చేరుకోవాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పేర్కొన్నారు. మారేడుబాక ప్రభుత్వ కాలేజ్‌లో గురువారం స్మార్ట్ మెటీరియల్స్ అడ్వాన్స్‌డ్ అప్లికేషన్ అనే అంశంపై అంతర్జాతీయ సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ టి.కె.వి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే వేగుళ్ళ ముఖ్య అతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. దక్షిణ కొరియా నుంచి వచ్చిన ప్రొఫెసర్ కె.నవీన్ కుమార్, డాక్టర్ ఎ.బార్గవ్ మాట్లాడుతూ ఆధునిక కాలంలో స్మార్ట్ మెటీరియల్ అవశ్యకతను వివరించారు. తిరుచునాపల్లి ఎన్ఐటీ నుంచి విచ్చేసిన ప్రొఫెసర్ హేమలత నానో మెటీరియల్స్ పాలిమార్ అంశంపై వివరించారు. స్మార్ట్ మెటీరియల్ అనే అంశంపై డాక్టర్ బిపిన్ కుమార్ (న్యూ ఢిల్లీ), డాక్టర్ పి.విష్ణు ప్రశాంత్(తిరుపతి)లు వివరణాత్మకంగా సందేశాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో దేశ విదేశాల నుంచి పరిశోధన వ్యాసాలు సుమారు వందకు పైగా వచ్చినట్టు కె.శ్రీనివాసరావు పేర్కొన్నారు.

అప్పనపల్లిలో రక్తదాన శిబిరం


అప్పనపల్లిలో రక్తదానం చేస్తున్న చిరంజీవి అభిమానులు

మామిడికుదురు: సినీనటుడు చిరంజీవి జన్మదిన వేడుకల సందర్భంగా మామిడికుదురు మండలం అప్పనపల్లిలో గురువారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. పలువురు చిరంజీవి సేవా సమితి సభ్యులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో రాజోలు తాలూకా చిరంజీవి సేవా సమితి అధ్యక్షులు గుండాబత్తుల తాతాజీ, సర్పంచ్‌లు గెద్దం మంగాలక్ష్మి, అడబాల తాతకాపు, సుందరనీడి చిన్ని, ఎంపీటీసీ కొమ్ముల జంగమయ్య, వీధి సత్తిబాబు, తులా ఉమ, కంకిపాటి నర్సింహరావు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

రాజోలు: సినీనటుడు చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా అరవపాలెం చిరంజీవి సేవాసమితి ఆధ్వర్యంలో కడలి పంచాయతీ స్వీపర్లకు, వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. అలాగే స్థానిక ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయ కర్త గుండుబోగుల పెద్దకాపు, సూరిశెట్టి శ్రీనివాస్, గుండాబత్తుల తాతాజీ, వులిశెట్టి లక్ష్మణరావు పాల్గొన్నారు.

చిన్నారి గుండె చికిత్సకు రూ.30 వేల ఆర్థిక సాయం


గొల్లపాలెంలో చిన్నారి తండ్రి కిరణ్‌కు నగదు అందజేస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ సభ్యులు

కాజులూరు: గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న ఆర్యావటానికి చెందిన రెండు నెలల చిన్నారికి హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ రూ.30 వేల సాయం అందజేసింది. తూర్పుగోదావరి జిల్లా కరప మండలం శిరిగలపల్లిలంకకు చెందిన కురుపూడి కిరణ్, శ్రావణి దంపతులకు రెండు నెలల క్రితం ఆడపిల్ల జన్మించింది. పాప గుండెలో మూడు రంధ్రాలు ఉండటంతో కాకినాడ ఆసుపత్రిలో చేర్పించి అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించారు. చిన్నారికి వెంటనే ఆపరేషన్ చేయాలని వైద్యులు ధ్రువీకరించారు. తల్లిదండ్రులు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారని తెలుసుకున్న హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ ప్రధాన కార్యదర్శి ఎ.శ్రావణి హైదరాబాద్‌కు చెందిన పారిశ్రామికవేత్తలు జి.విఠల్‌రెడ్డి, గుత్తుల మీరాకుమార్‌లను సంప్రదించగా వారు రూ.25 వేల ఆర్థిక సాయం అందజేసారు. హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ సభ్యులు మరో రూ.5 వేలు సమకూర్చి మొత్తం రూ.30 వేలు గురువారం గొల్లపాలెంలో చిన్నారి తండ్రి కురుపూడి కిరణ్‌కు అందజేశారు. కార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ సభ్యులు పి.శ్రీను, కె.సూర్యకుమారి, రామతులసి, తుని హెల్ప్ గ్రూప్ సంస్థ అధ్యక్షుడు కాళ్ల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణతోనే కాలుష్య నివారణ


గొల్లపాలెంలో మొక్కలు నాటుతున్న సర్పంచ్ ప్రసన్నమౌనిక తదితరులు

కాజులూరు: పర్యావరణ పరిరక్షణతొనే కాలుష్య నివారణ సాధ్యమని గొల్లపాలెం గ్రామ సర్పంచ్ పి. ప్రసన్నమౌనిక అన్నారు. తల్లి పేరుతో ఒక మొక్క కార్యక్రమంలో భాగంగా గురువారం ఉపాధి హామీ పథకం సిబ్బంది మండలంలోని పలు గ్రామాల్లో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో విరివిగా మొక్కలు నాటాలన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణను బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు సీహెచ్ వేణుగోపాలరావు, షేక్ జహంగీర్, ఉపాధి ఎఫ్ఓ టేకుమూడి అర్జునరావు, పంచాయతీ పాలకవర్గ సభ్యుడు రేఖపల్లి సత్తిబాబు, వీఆర్ఏ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలపై దృష్టి సారించాలి


సర్వ సభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

రాజోలు: గ్రామాల్లో సమస్యల పరిష్కారంపై అధికారులు దృష్టి సారించాలని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. గురువారం రాజోలు మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం ఎంపీపీ కేతా శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే వరప్రసాద్ పాల్గొని మాట్లాడారు. రాజకీయ పార్టీలకు అతీతంగా అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండాలని, అవినీతి ఆరోపణలున్న ఉద్యోగులు పద్ధతి మార్చుకోవాలన్నారు. ప్రస్తుత వాతావరణం దృష్ట్యా గ్రామాల్లో శానిటేషన్‌పై దృష్టి సారించాలన్నారు. గ్రామాల్లో ప్రజలకు తాగు నీరు సక్రమంగా అందించాలన్నారు. గ్రామాల్లోని పలు సమస్యలపై పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఎమ్మెల్యే వరప్రసాద్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు మట్టా శైలజ, మండల ఉపాధ్యక్షులు పొలమూరి శ్యాంబాబు, ఇంటిపల్లి ఆనందరాజు, ఎంపీడీఓ ఎస్.బాలాజీ, తహసీల్దారు ఎస్ఎస్ఎస్ ప్రసాద్, రాజోలు సీఐ నరేష్‌కుమార్, ఎస్ఐ రాజేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్త్రీల ఆసుపత్రిని వెల్లూరు వైద్యశాలలా తీర్చిదిద్దుతాం


అంబాజీపేట స్త్రీల ఆస్పత్రిని పరిశీలిస్తున్న డాక్టర్ రూప్ సోలోమాన్

అంబాజీపేట: గ్రామీణ ప్రాంతంలో 58 ఏళ్ల క్రితం స్థాపించి ఎన్నో ఉన్నత ప్రమాణాలతో నిర్వహిస్తున్న అంబాజీపేట స్త్రీల ఆసుపత్రిని తమిళనాడులోని వెల్లూరు ఆసుపత్రి తరహాగా తీర్చిదిద్దుతామని తమిళనాడులోని స్కడ్డర్ మెమోరియల్ ఆసుపత్రి డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రూప్ సోలోమాన్ వెల్లడించారు. అంబాజీపేట స్త్రీల ఆసుపత్రి 58వ వార్షికోత్సవ వేడుకలు ఆసుపత్రి సీఈవో డాక్టర్ ఎస్ఆర్‌కే హెవార్డు రాజ్ అధ్యక్షతన గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సోలోమాన్ మాట్లాడుతూ తమిళనాడులోని స్కడ్డర్ ఆసుపత్రికి రెండు శతాబ్దాల చరిత్ర, అనుభవం ఉందని, ఎంతో పేరుగాంచిన రాయవెల్లూరు ఆసుపత్రికి మాతృ సంస్థ అని పేర్కొన్నారు. అంబాజీపేటలో ఉన్న స్త్రీల ఆసుపత్రిని మరిన్ని అధునాతన సదుపాయాలతో కార్పొరేట్ ఆసుపత్రికి దీటుగా తీర్చిదిద్ది పేద ప్రజలకు మరింత సేవలందిస్తామన్నారు. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య విభాగాలు ప్రారంభించి అధునాతన ల్యాబ్‌లను పరిశీలించారు. ఆసుపత్రి వార్షికోత్సవం సందర్భంగా వివిధ అంశాల్లో నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

ముంపు బాధితులకు బియ్యం అందజేత


పాశర్లపూడిలో బియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

మామిడికుదురు: పాశర్లపూడిబాడవలో గోదావరి వరద ముంపు బాధితులకు ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ గురువారం బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముంపు బాధితులకు గతంలోనే బియ్యం, ఆయిల్, పప్పు, ఉల్లిపాయలు, బంగాళాదుంపలు అందించామన్నారు. బాధితుల్లో మిగిలిన వారిని కూడా గుర్తించి వారికి కూడా సహాయం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కొనుకు ప్రేమజ్యోతి, జాలెం శ్రీనివాసరాజు, చుట్టుగుళ్ల కిశోర్, కొల్లు ఏడుకొండలు, మంద గాంధీ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉపాధి హామీ గ్రామ సభలు

రామచంద్రపురం రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టనున్న పనులను గుర్తించేందుకు శుక్రవారం మండలంలోని 25 పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించనున్నట్టు రామచంద్రపురం ఎంపీడీఓ ఎస్.కీర్తిస్పందన గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారపుపేట, అన్నాయిపేట, బాపనయ్యచెరువు, భీమక్రోసుపాలెం, ద్రాక్షారామ, జగన్నాయకులపాలెం, కందులపాలెం, కాపవరం, నెలపర్తిపాడు, ఓదూరు, తాడిపల్లి, తాళ్లపొలం, తోటపేట, ఉండూరు, ఉట్రుమిల్లి, వెలంపాలెం, వెల్ల, వెంకటాయపాలెం, ఏరుపల్లి గ్రామాల్లో ఉదయం 10 గంటలకు, మాలపాడు, నరసాపురపుపేట గ్రామాల్లో ఉదయం 11 గంటలకు, హసన్‌బాదలో మధ్యాహ్నం 2 గంటలకు, యనమదల, వేగాయమ్మపేట, చోడవరం గ్రామాల్లో మధ్యాహ్నం 3 గంటలకు గ్రామ సభలు నిర్వహిస్తారన్నారు. ఈ గ్రామ సభల నిర్వహణకు ప్రత్యేక అధికారులను నియమించామన్నారు. గ్రామాల్లోని ప్రజాప్రతినిధులు, ప్రజలు హాజరుకావాలని కోరారు.

మండపేట రూరల్ సీఐగా దొరరాజు


సీఐ దొరరాజు

మండపేట: మండపేట రూరల్ సీఐగా పీతల దొరరాజు గురువారం బాధ్యతలు చేపట్టారు. రామచంద్రపురం నుంచి బదిలీపై మండపేట రూరల్ సర్కిల్‌కు వచ్చారు. గతంలో ఈయన మండపేట రూరల్ స్టేషన్‌లో ఎస్సైగా పని చేశారు. మండపేట రూరల్ సీఐ కె.శ్రీధర్ వీఆర్‌లో ఉన్నారు. ఇక ఉన్నారు.

పీఎంపీ కుటుంబానికి ఆర్థిక సాయం


బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న పీఎంపీ అసోసియేషన్

మండపేట: ఇటీవల అనారోగ్యంతో మరణించిన ఇప్పనపాడుకు చెందిన పీఎంపీ శెట్టి రామకృష్ణ కుటుంబానికి పీఎంపీ అసోసియేషన్ ఆర్థిక సాయం అందించింది. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కోన సత్యనారాయణ ఆధ్వర్యంలో సభ్యుల సహకారంతో రూ.30 వేలను అందజేశారు. గురువారం బాధితుల ఇంటికి వెళ్లి నగదును అందించారు. బీవీ రమణ, వీకే రాజు, ఇరవాడ రవికుమార్, వెంకటేశ్వరరావు, ఎం.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులు సద్వినియోగం చేసుకోవాలి

రాయవరం: భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వం కల్పిస్తున్న బీమా సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాయవరం సహాయ ఉపాధి కల్పనాధికారి గోదావరి కేశవరావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. వాణిజ్య, వ్యాపార, భవన నిర్మాణ కార్మికులకు రూ.110ల నామమాత్రపు రుసుంతో ఐదేళ్ల కాలపరిమితికి బీమా సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. ఆసక్తి కలిగి, అర్హులైన లబ్ధిదారులు ఆధార్, బ్యాంకు ఖాతా, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, సెల్‌ఫోన్ నంబరుతో కార్యాలయంలో సంప్రదించాలన్నారు. వివిధ దుకాణ యజమానులు, సంస్థల యజమానులు లేబర్ సెస్ పునరుద్ధరణ చేసుకోవాలని, కార్మికుల సంక్షేమ నిధికి నిర్దేశిత నగదును చెల్లించాలన్నారు. భవన, వ్యాపార, వాణిజ్య సముదాయాల నిర్మాణదారులు ఒక శాతం లేబర్ సెస్ చెల్లించాలని, రిజిస్ట్రేషన్ కాపీ, రశీదు జెరాక్స్‌లను కార్యాలయానికి అందజేయాలని ఆయన యజమానులకు సూచించారు. బాల కార్మికులతో పని చేయించుకోవడం చట్టరీత్యా నేరమన్నారు. చిన్నారులతో పనులు చేయించే సంస్థలపై దాడులు నిర్వహించి, జరిమానా విధిస్తామని ఆయన అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కేశవరావు హెచ్చరించారు.